




EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
02-01-2026
పేజీలు: 02

## షణ్ముఖ్ జస్వంత్ కొత్త లవ్ స్టోరీ



న్యూ ఇయర్ సందర్భంగా షణ్ముఖ్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు కొత్త చర్చకు దారి తీసింది. ముఖం కనిపించకుండా ఓ యువతితో దిగిన పలు ఫోటోలను షేర్ చేస్తూ .. "Happy Birthday V_ _ _ This is God's plan" అని క్యాప్షన్ పెట్టాడు. దీంతో ఆ అమ్మాయి పేరు 'V' అక్షరంతో ప్రారంభమవుతుందన్న అంచనాలు మొదలయ్యాయి. అయితే ఆమె ఎవరో మాత్రం వెల్లడించలేదు.

## మూసీ పేరుతో ఇండ్లను కూల్చివేస్తే ఊరుకోం..
## బుల్డోజర్ల కింద పడుకుని అడ్డుకుంటాం



మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తున్నారని అడిగారు. ఒకసారి లక్ష కోట్లు అన్నారని.. మరోసారి లక్షన్నర కోట్లు అన్నారని తెలిపారు. మూసీ సుందరీకరణకు ఒరిజినల్ వ్యయమెంత అని నిలదీశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ కోసం ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు కూల్చివేశారని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులందరికీ ఇండ్లు ఇచ్చారా అని అడిగారు. ప్రాజెక్టు కోసం ఎంత ప్రైవేటు భూమిని సేకరిస్తున్నారని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.14.50 లక్షల చొప్పున నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. అలాగే 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మరి నిర్వాసితులకు కేసీఆర్ కట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. మూసీలోకి నీళ్లు తీసుకొస్తామని మంత్రి చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. రెండున్నర టీఎంసీల గోదావరి జలాలను ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్ నుంచి తీసుకొస్తున్నారా? లేదా గాలిలో నుంచా అని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు ఎంత ఖర్చు పెట్టాలని ప్రభుత్వం అనుకుంటుందో సమాధానం చెప్పాలన్నారు. మూసీలోకి మురుగునీరు రాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంలో 30కి పైగా ఎస్టీపీలు నిర్మించామని, వికారాబాద్‌లో కూడా ఎస్టీపీలు నిర్మించామని తెలిపారు. కానీ అవి ఇప్పుడు పనిచేయడం లేదన్నారు. ఇటీవల వచ్చిన మూసీ వరదలపైనా హరీశ్‌రావు అనుమానం వ్యక్తం చేశారు. అసలు జంట జలాశయాల్లోకి ఎంత వరద నీరు వస్తుందో తెలుసా అని ప్రశ్నించారు. ఒకేసారి ఉద్దేశపూర్వకంగా జలాశయాల గేట్లు ఎత్తారా అని నిలదీశారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇండ్లను ముంచడానికే గేట్లు తెరిచారా అని అడిగారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చివేస్తే బీఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైతే బుల్డోజర్ల కింద పడుకుని కూల్చివేతలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

**గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన**

స్పీకర్ గడ్డం ప్రసాద్ ఏకపక్ష వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ వద్దకు కాలినకడన వచ్చిన ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఇది శాసనసభనా? గాంధీ భవనా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో మూసీ సుందరీకరణ అంశంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం వ్యాఖ్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. కానీ అందుకు స్పీకర్ నిరాకరించడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

VS

## మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం
### సీఎం రేవంత్ రెడ్డి



కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు. మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. జలవనరులను కలుషితం చేసి కబ్జాలు పెట్టి ఫాంహౌస్‌లు నిర్మించారని.. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారని మండిపడ్డారు. అందుకే ఆ డ్రైనేజీలను కూలగొట్టి.. కబ్జాలపై చర్యలు తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

అయితే మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు.

గతంలో గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60 వేల కుటుంబాలను మరో ప్రాంతానికి తరలించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యూపీలో గంగా నది ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారన్నారు. నది పరివాహక ప్రాంతాల అభివృద్ధిని బీజేపీ ఎన్నికల అజెండాగా మార్చిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించట్లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు.

మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ ప్రక్షాళన కన్సల్టెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచామన్నారు. 3 సంస్థల జాయించ్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ చేపడుతున్నట్లు వివరించారు. గోదావరి నుంచి 20 టీఎంసీలు నగరానికి తరలించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. నగరం దాహార్తి తీర్చేందుకు 15 టీఎంసీలు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మరో 5 టీఎంసీలు గండిపేటకు తరలించాలని యోచన తమ ప్రభుత్వానికి ఉందని వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నాం_ _ _ మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## భర్త కంటే పార్టీయే ముఖ్యం..
## నాగ్‌పూర్ మాజీ మేయర్ సంచలన నిర్ణయం



మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఒక రాజకీయ నాయకురాలి కుటుంబంలో చీలిక తెచ్చాయి. బీజేపీ పట్ల తనకున్న అచంచలమైన విధేయతను చాటుకుంటూ నాగ్‌పూర్ మాజీ మేయర్ అర్చనా దేహంకర్ తన భర్త వినాయక్ దేహంకర్‌ను వదిలి పుట్టింటికి వెళ్లిపోయారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా తన భర్త స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడాన్ని నిరసిస్తూ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. వినాయక్ దేహంకర్ నాగ్‌పూర్ మున్సిపల్ ఎన్నికల్లో 17వ వార్డు నుంచి బీజేపీ టికెట్ ఆశించారు. అయితే, పార్టీ నాయకత్వం ఆయనను కాదని, ఇటీవల కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన మనోజ్ సాబ్లేకు టికెట్ కేటాయించింది. దీనిని అవమానంగా భావించిన వినాయక్.. బీజేపీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేసిన తమను కాదని బయటి వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భర్త తీసుకున్న నిర్ణయాన్ని అర్చనా దేహంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. 2009 నుంచి 2012 వరకు తనను మేయర్ పదవిలో కూర్చోబెట్టి, గౌరవించిన పార్టీకి వెన్నుపోటు పొడవటం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. "ఒకే ఇంట్లో ఉంటూ ఇద్దరం పరస్పర విరుద్ధమైన రాజకీయ బాటలో పయనించడం సాధ్యం కాదు. నాకు పార్టీయే ముఖ్యం" అని స్పష్టం చేస్తూ ఆమె ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. పార్టీ అధికారిక అభ్యర్థి విజయం కోసం ప్రచారం చేయనున్నట్లు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## లెక్చరర్‌తో ప్రేమలో..



గతంలో ఆహా ఓటీటీ లో స్ట్రీమింగ్ అయిన త్రీ రోజెస్ వెబ్ సిరీస్ కు మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యూత్ కు ఈ సిరీస్ తెగ నచ్చేసింది. ఇప్పుడు ఈ సక్సెస్ ఫుల్ సిరీస్ కు రెండో సీజన్ వచ్చేస్తోంది. 'త్రీ రోజెస్' సీజన్ 2 త్వరోలనే ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సిరీస్ లో తెలుగమ్మాయిలు ఈషా రెబ్బా, కుషిత కల్లపు, రాశీ సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సిరీస్ డిసెంబర్ 12న స్ట్రీమింగ్ కానుంది. దీంతో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజి బిజీగా ఉంటోంది. హీరోయిన్లు కూడా వరుసగా ఇంటర్వ్యూలకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో రాశీ సింగ్ తన కాలేజ్ డేస్ నాటి లవ్ స్టోరీ గురించి చెప్పుకొచ్చింది.




## సికింద్రాబాద్ వాసికి సైబర్ కేటుగాళ్ల వల.. రూ. 72 లక్షల స్వాహా

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో అమాయకులను మోసగిస్తున్నారు. తాజాగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి (59)ని బురిడీ కొట్టించి ఏకంగా రూ. 72 లక్షలు కాజేశారు. బాధితుడు ఫేస్‌బుక్‌లో వచ్చిన ఓ స్టాక్ ట్రేడింగ్ ప్రకటనను చూసి ఆకర్షితుడయ్యాడు. వారిని సంప్రదించగా.. తాము ప్రముఖ ట్రేడింగ్ సంస్థకు చెందిన మార్కెటింగ్ మేనేజర్లుగా అవతలి వ్యక్తులు పరిచయం చేసుకున్నారు. బాధితుడిని తొలుత ఓ వాట్సాప్ గ్రూపులో చేర్చి స్టాక్ టిప్స్, ఐపీఓ స్ట్రాటజీలు, మార్కెట్ విశ్లేషణలు చెబుతూ నమ్మకం కలిగించారు. అనంతరం ప్రైమ్ ట్రేడింగ్ గ్రూపులో చేర్పించి కేవైసీ (KYC) వివరాలు తీసుకున్నారు. మొదట్లో బాధితుడితో చిన్న మొత్తాల్లో పెట్టుబడి పెట్టించి, లాభాలు వచ్చినట్లు చూపడమే కాకుండా.. వాటిని విత్‌డ్రా చేసుకునే అవకాశం కూడా కల్పించారు. దీంతో వారిని పూర్తిగా నమ్మిన బాధితుడు భారీగా పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమయ్యాడు. అదే అదనుగా భావించిన నేరగాళ్లు.. ప్రత్యేక ఐపీఓలు కేటాయిస్తున్నామని, అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. అలాగే క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉందని, అది పెరగాలంటే ఇంకా డబ్బు పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేశారు. స్క్రీన్‌పై భారీ లాభాలు కనిపిస్తుండటంతో.. కమీషన్లు, వీఐపీ మెంబర్‌షిప్ ఛార్జీల పేరుతో బాధితుడి నుంచి విడతల వారీగా మొత్తం రూ. 72 లక్షలు వసూలు చేశారు. ఆ తర్వాత అతడిని గ్రూప్ నుంచి తొలగించి, మెసేజ్‌లకు స్పందించడం మానేశారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# పది నిమిషాల్లో డెలివరీ వెనకున్న రహస్యం ఇదీ

## జొమాటో సీఈవో

భద్రతా సమస్యలపై గిగ్ వర్కర్లు చేపట్టిన సమ్మెతో అల్ట్రా ఫాస్ట్ డెలివరీలపై మరోసారి చర్చ ఊపందుకుంది. కొత్త సంవత్సరం రోజున వీరి సమ్మె జొమాటో, బ్లింకిట్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో డెలివరీ సేవలపై పెద్దగా ప్రభావం చూపించనప్పటికీ.. పది నిమిషాల్లో డెలివరీ మోడల్ వల్ల రైడర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో దీనిపై జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ స్పందించారు. పది నిమిషాల్లో డెలివరీ విధానంపై వివరణ ఇచ్చారు. ఈ డెలివరీ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని నెటిజన్లకు అర్థమయ్యేలా వివరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వరుస పోస్టులు పెట్టారు. డెలివరీ వేగం మౌలిక సదుపాయాలపై ఆధారపడి ఉంటుందని, రైడర్లపై ఒత్తిడి ద్వారా కాదని గోయల్ వివరించారు. 'మీ ఇళ్ల చుట్టూ పెరుగుతున్న దుకాణాల వల్లే మా 10 నిమిషాల డెలివరీ సేవలు సాధ్యమవుతున్నాయి. డెలివరీ పార్ట్‌నర్స్ వేగంగా డ్రైవ్ చేయడం వల్ల ఇది సాధ్యం కాదు. అసలు డెలివరీ కోసం కస్టమర్‌కు మేం చేసిన టైమర్ ప్రామిస్ రైడర్‌కు యాప్‌లో కనిపించదు. బ్లింకిట్‌లో మాకు వచ్చిన ఆర్డర్‌ను ప్యాక్ చేయడానికి 2.5 నిమిషాల సమయం పడుతుంది. డెలివరీ సగటున 2 కిలోమీటర్ల పరిధిలోనే ఉంటుంది. గంటకు 15 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినా 8 నిమిషాల్లో లొకేషన్‌కు రీచ్ అయిపోవచ్చు' అని తెలిపారు.

# గాలి జనార్ధన్ రెడ్డిపై కేసు నమోదు



కర్ణాటకలోని బళ్లారిలో బ్యానర్లు కట్టే విషయంలో ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి వర్గానికి, కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్ రెడ్డి వర్గానికి మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో గాలి జనార్ధన్ రెడ్డి, ఆయన సోదరుడు సోమశేఖర్ రెడ్డి, ఆయన సన్నిహితుడు, మాజీ మంత్రి శ్రీరాములు సహా పది మందిపై బ్రూస్ పేట పోలీసులు కేసు నమోదు చేశారు. భరత్ రెడ్డి అనుచరుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసులు నమోదయ్యాయి. రాళ్లు, కొడవళ్లు, కర్రలు, సోడా బాటిల్స్ తో తమపై దాడి చేశారని భరత్ వర్గం ఆరోపించింది. మరోవైపు, ఈ ఘటనలో ఒక వర్గంపై మరో వర్గం దాడికి పాల్పడింది. ఇద్దరి గన్ మెన్లు గాల్లోకి కాల్పులు జరిపారు. ఒక గన్ మెన్ నుంచి తుపాకీని లాక్కున్న సతీశ్ రెడ్డి గాలి జనార్ధన్ రెడ్డిపై కాల్పులకు దిగారు. అయితే, జనార్ధన్ రెడ్డి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇదే సమయంలో ఇరు వర్గాలు కాల్పులకు దిగాయి. ఈ క్రమంలో భరత్ రెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్ మృతి చెందాడు. ఈ ఘటనలో సతీశ్ రెడ్డికి బుల్లెట్ గాయమయింది. దీంతో, ఆయనను చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. ప్రస్తుతం బళ్లారిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీగా పోలీసులు మోహరించారు. ఈ ఘటనపై గాలి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ... తనపై కాల్పులు జరిపిన బుల్లెట్ ను మీడియాకు చూపించారు.



# తిరుమలలో భక్తుల కోసం టీటీడీ సరికొత్త ఆలోచన

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో వైకుంఠ ద్వార దర్శనాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గోవిందనామ స్మరణతో తిరుమల గిరులు మార్మోగుతున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు కేవలం మూడు రోజుల్లోనే దాదాపు 33 వేల వాహనాలు తిరుమలకు చేరుకోగా, సుమారు 1,77,000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం కూడా రికార్డు స్థాయిలో నమోదైంది. డిసెంబర్ 30న రూ. 2.25 కోట్లు రాగా, 31న ఏకంగా రూ. 4.79 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తుల దాహార్తిని తీర్చేందుకు టీటీడీ ఓ వినూత్న ఆలోచనను అమలు చేసింది. ఎండలో అలసిపోయే భక్తులకు తక్షణమే నీరు అందించేలా శ్రీవారి సేవకులు వీపుకు వాటర్ క్యాన్లను తగిలించుకుని గ్లాసులతో నీటిని అందిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తులకు ఈ సేవ ఎంతో ఊరటనిస్తోంది. ఈ కొత్త విధానంపై భక్తుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రస్తుతం టోకెన్లు లేని భక్తులను కూడా సర్వదర్శనానికి అనుమతిస్తున్నారు. ఆక్టోపస్ భవనం, నారాయణగిరి ఉద్యానవనం మీదుగా క్యూలైన్లను క్రమబద్ధీకరించి, వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 ద్వారా భక్తులను లోపలికి పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా... చెన్నైకి చెందిన పొన్నయ నాగేశ్వరన్ అనే భక్తుడు టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు.

# వివాదంలో అన్వేష్.. విదేశాల్లో ఉన్న యూట్యూబర్‌పై పంజాగుట్ట పోలీసుల నజర్!

ప్రముఖ తెలుగు ట్రావెల్ యూట్యూబర్ అన్వేష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. హిందూ దేవతలను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేశారన్న ఆరోపణలతో ఆయనపై హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బీజేపీ నేత కరాటే కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న అన్వేష్‌ను పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ వ్యవహారం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని సోషల్ మీడియా వేదికలపై హాట్ టాపిక్‌గా మారింది. అన్వేష్ విదేశాల్లో ఉన్న నేపథ్యంలో, అతని ఆచూకీ కనుగొనడం పోలీసులకు సవాలుగా మారింది. ఈ క్రమంలోనే పంజాగుట్ట పోలీసులు అన్వేష్‌కు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ ఐడీ వివరాలు, ఐపీ అడ్రస్ వంటి సాంకేతిక సమాచారాన్ని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్యానికి అధికారికంగా లేఖ రాశారు. ఈ డేటా అందిన వెంటనే అతడు ఏ దేశంలో, ఏ ప్రాంతంలో ఉన్నాడో గుర్తించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. అవసరమైతే అతడికి ఆన్‌లైన్ ద్వారానే నోటీసులు జారీ చేసే ఆలోచనలో కూడా అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివాదంపై




హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కోట్లాది మంది విశ్వాసాలను దెబ్బతీసేలా ప్రవర్తించిన అన్వేష్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి. పర్యాటక రంగం గురించి సమాచారం ఇస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న అన్వేష్, అనవసరంగా మతపరమైన అంశాల్లో జోక్యం చేసుకుని చిక్కుల్లో పడ్డారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. కరాటే కళ్యాణి ఫిర్యాదుతో ఈ కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు, ఈ వ్యవహారంపై అన్వేష్ ఇప్పటివరకు స్పందించలేదు. విదేశాల్లో తిరుగుతూ వీడియోలు అప్‌లోడ్ చేస్తున్న ఆయన, పోలీసు విచారణకు సహకరిస్తారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ నోటీసులకు స్పందించకపోతే, లుకౌట్ సర్క్యులర్ జారీ చేసే అవకాశం కూడా ఉందని సమాచారం. ప్రస్తుతం విదేశీ వీధుల్లో విహరిస్తున్న ఈ యూట్యూబర్‌కు హైదరాబాద్ పోలీసులు ఇస్తున్న ఈ 'షాక్' ఎలాంటి మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# వందే భారత్ ప్రయాణికులకు గుడ్‌న్యూస్



ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక వందే భారత్ సర్వీసులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. వీటిల్లో తరచూ వేలమంది ప్రయాణం చేస్తూ సౌకర్యవంతమైన సేవలు పొందగలుగుతున్నారు. వేగంగా గమ్యస్థానానికి చేరుకోవడంతో పాటు అత్యాధునిక సౌకర్యాలు వందే భారత్ రైళ్లల్లో అందుబాటులో ఉన్నాయి. మోడ్రన్ కిచెన్, వాష్ రూమ్స్‌తో పాటు మంచి ఫుడ్ కూడా వీటిల్లో లభిస్తోంది. ఎలాంటి అసౌర్యానికి గురి కాకుండా ప్రశాంతవంతమైన ప్రయాణం వీటిల్లో చేయవచ్చు. దీంతో వేగంగా ఏదైనా ప్రాంతానికి వెళ్లాలనుకునేవారు వందే భారత్ రైళ్లను ఆశ్రయిస్తున్నారు. వీటిల్లో ఆక్యూపెన్సీ కూడా భారీగా ఉంటుంది. అయితే త్వరలో రైలు ప్రయాణికుల కోసం వందే భారత్ స్లీపర్ రైళ్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. జనవరిలోనే ఢిల్లీ-పాట్నా మధ్య తొలి వందే భారత్ స్లీపర్ ట్రైన్‌ను భారతీయ రైల్వే ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఆ తర్వాత ఢిల్లీ-ముంబై మధ్య మరో స్లీపర్ రైలు ప్రవేశపెట్టనుండగా.. ఆ తర్వాత విడతల వారీగా దేశవ్యాప్తంగా పలు రూట్లలో పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే ఆయా రూట్లలో వందే భారత్ స్లీపర్ రైళ్ల ట్రయల్ రన్ కూడా పూర్తయింది. దీంతో త్వరలోనే ఇవి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 164 వందే భారత్ సర్వీసులు సేవలు అందిస్తున్నాయి. వీటితో పాటు త్వరలో స్లీపర్ రైళ్లు కూడా రానున్నాయి. గత ఏడాది ప్రధాని మోదీ మొత్తం 42 ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. 25 వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. భారత్‌లో రైల్వే నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు, ప్రపంచంలోనే అగ్రగామిగా రైల్వే వ్యవస్థను ఉంచేందుకు రైల్వేశాఖ ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగా హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెడుతోంది.

# బత్తాయిలతోనే కొడతా.. మరో కొత్త వీడియోతో అన్వేష్ రచ్చ

యూట్యూబర్ అన్వేష్ ఇటీవల హిందూ దేవతలపై చేసిన వ్యాఖ్యలతో తీవ్ర వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, సోషల్ మీడియాలో అతడిపై వ్యతిరేకత పెరుగుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అన్‌ఫాలో చేయడం, యూట్యూబ్ ఛానల్‌ను బాయ్‌కాట్ చేయాలంటూ పిలుపులు రావడంతో అన్వేష్ ఫాలోవర్ల సంఖ్య తగ్గుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాల్లో పలు పోలీస్ స్టేషన్లలో అతనిపై కేసులు కూడా నమోదయ్యాయి. అరెస్ట్ చేయాలన్న డిమాండ్ మరింత బలపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అన్వేష్ తాజాగా 'ఆరెంజ్ జ్యూస్' పేరుతో మరో వీడియోను పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియోలో ఆయన తన వ్యాఖ్యలను సమర్థించుకునే ప్రయత్నం చేసినట్లుగా నెటిజన్లు భావిస్తున్నారు. దేవుడి పేరును ప్రస్తావిస్తూ, తనకు కలలో సందేశాలు వచ్చాయంటూ చెప్పడం మరోసారి వివాదానికి దారితీసింది. ఆ వీడియోలో అన్వేష్.. ఆంజనేయ స్వామి తన కలలో కనిపించారని, ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారని చెప్పాడు. కాషాయం రంగును ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్న వారిపై పోరాటం చేయాలని దేవుడు చెప్పినట్టు పేర్కొన్నాడు. అంతేకాదు, తాను ఇకపై అసభ్య పదజాలం ఉపయోగించబోనని, దేవుడి మీద ప్రమాణం చేస్తున్నానని కూడా తెలిపాడు.

# వైభవ్ సూర్యవంశీపై భారీ బాధ్యత

భారత్, సౌత్ ఆఫ్రికా అండర్-19 జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది. అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే, ఈ సిరీస్‌లో భారత జట్టుకు వైభవ్ సూర్యవంశీ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రెగ్యులర్ కెప్టెన్ ఆయుష్ గాయం కారణంగా పర్యటనకు దూరం కావడంతో, వైభవ్‌కు ఈ బాధ్యత అప్పగించారు. భారత అండర్-19 జట్టుకు అతను కెప్టెన్సీ వహించడం ఇదే తొలిసారి. అలాగే, సౌత్ ఆఫ్రికాపై ఇది అతని అరంగేట్రం (డెబ్యూ) మ్యాచ్ కావడమే కాకుండా, ఆఫ్రికా గడ్డపై అతను ఆడటం కూడా ఇదే మొదటిసారి. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దేశీవాళీ క్రికెట్ మరియు అండర్-19 స్థాయిలో అతని దూకుడైన ఆటతీరు సెలక్టర్ల దృష్టిని ఆకర్షించింది. ఈ పర్యటన ద్వారా తన కెప్టెన్సీ ప్రతిభను నిరూపించుకోవడమే కాకుండా, వరల్డ్ కప్‌కు ముందు తన ఫామ్‌ను కొనసాగించాలని అతను భావిస్తున్నాడు. విదేశీ పరిస్థితుల్లో ప్రాక్టీస్ చేయడానికి భారత యువ జట్టుకు ఇది ఒక మంచి అవకాశం. వరల్డ్ కప్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుండటంతో, వైభవ్ వంటి ఆటగాళ్ల పాత్ర ఎంతో కీలకం కానుంది.



# కుర్రకారుకు పిచ్చెక్కిస్తున్న కేట్ శర్మ

బికినీలో తన నాజూకు అందాలను హైలైట్ చేస్తూ కుర్రకారు మతిపోగొడుతోంది ఈ ముద్దుగుమ్మ. కేట్ శర్మ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ పిక్స్ చూసిన వారంతా హాట్, ఉఫ్, స్టన్నింగ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొద్ది గంటల్లోనే ఫొటోలకు లక్షల్లో లైకులు వచ్చాయి.సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ కనిపించే కేట్ శర్మ.. తరచు నెట్టింట బోల్డ్ ఫొటో షూట్లతో ఆకట్టుకుంటూ ఉంటుంది.కేట్ శర్మ జూలై 19, 1997న భారతదేశంలోని మహారాష్ట్రలోని ముంబైలో జన్మించింది. రూహ్‌దార్ , పరమావతార్ శ్రీ కృష్ణ, తు మేరీ జిందగీ వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకుంది.సినిమాల్లో పెద్దగా కనిపించక పోయినా.. సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫోజులతో కుర్రకారును ఫిదా.

